# అతడు సర్వాధికారి

"సారథి"

తెల్లగ తెల్లవారలేదు. నేనుహోటలుకు బయలుదేరాను. వెల్కమ్‌హోటలు తలుపుమీద యెవరో దబదబ గ్రుద్దారు. ఆబాదడములో అధికారము శబ్దిస్తున్నది. హోటలయజమాని పరమేశ్వరఅయ్యరు గొణుగుకొంటూ తలుపు తెరిచాడు. తెరిచీ తెరవడముతోనే అయ్యరు కళ్లకు పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టరు అతనివెనుక యిద్దరుకాన్‌స్టేబిల్సు కనబడ్డారు. ఇది మంచిశకునము కాదనుకొన్నాడు పరమేశ్వరఅయ్యరు.

"మాధవరావుగారున్నారా" అని ఇన్‌స్పెక్టరు అధికారంతో అడిగాడు.

"ఉన్నారు మేడమీద నాల్గవగదిలో" అన్నాడు అయ్యరు.

"ఉన్నాడా" అంటూ సబ్ ఇన్‌స్పెక్టరు తనసిబ్బందితో చరచర మేడమీదికివెళ్లాడు. అయ్యరు కళ్లునలుపుకొంటూ వాళ్లవెనుక అతనివెంట నేనూ మెట్లెక్కాము.

నాల్గవనెంబరు గది తాళం వేసివుంది. సబ్ ఇన్‌స్పెక్టరు అయ్యరుతో "లేడే, వేరేతాళం వుందా" అన్నాడు.

అయ్యరు కంగారుపడుతూ లేదన్నాడు.

మాధవరావు గదితాళం బ్రద్దలుగొట్టారు. గది తెరిచీ తెరవడముతోనే కనబడినవి సిగరెట్టు పీకలు, పాత వార్తాపత్రికలు. ఒకప్రక్క మడతమంచము, మరొకమూల రెండుపెట్టెలు—యింతే ఆగదిలోవున్న సామగ్రి. పోలీసులు అలమారా తెరిచారు. అందులోనుండి యిన్ని పత్రికల కత్తిరింపులు గాలివడితో రెక్కలు వచ్చినట్లు యెగిరిపడినవి. బాంబుభయమో యేమోగాని అలమారా తెరిచిన పోలీసు వెనుకకు ఒకఅడుగు వేశాడు. పరమేశ్వర అయ్యరు "ఎన్నాదు" అంటూ గదిఅవతలకు దూకాడు. సబ్ యిన్‌స్పెక్టరు రెండడుగులు వెనుకకు వేస్తూ 'కంగారెందుకు' అంటూ పోలీసుమీద కోపంచూపాడు. ఈకంగారంతా కాగితపు కత్తిరింపులతో బయటబడిన ఒకకాగితాలకట్టనుచూచి !

ఇన్‌స్పెక్టరు ఆకట్టను విప్పించాడు. అందులోనివీ కత్తిరింపులే ! అందరి గుండెలూ దుటపడినవి.

పోలీసులు మడతమంచాన్ని తిరగవేశారు. పెట్టెలను బోర్లించారు. ఒకపెట్టెలో గుడ్డలు, మరొకపెట్టెలో పుస్తకాలు. ఆ పుస్తకాలుమీద ఆధారపడి జీవనంచేసే యెలుకవొకటి పరుగెత్తే సరికి మళ్లీ కొంచం కంగారు.—యింతకుమించి పోలీసులకు యేమీ దొరకలేదు.

మాధవరావు యెక్కడవుంటాడు?—యిది యిన్‌స్పెక్టరుయొక్క యోచన. హోటలు యజమానికి మూడురోజులక్రిందనే తనకుఒక నెలఅద్దె, భోజనపుఖర్చులు యిచ్చివేశాడని పరమేశ్వర అయ్యరు చెప్పాడు. ఇంకా యేవేవో ప్రశ్నలువేసి ఇన్‌స్పెక్టరు వెళ్ళిపోయాడు.

* * *

మాధవరావు పత్రికలకు వ్యాసాలువ్రాస్తూవుంటాడు. చిన్నచిన్న క్లబ్బులలో సమాజజీవన సమస్యల గురించి చర్చలుసాగిస్తూవుంటాడు. నేను హిమగిరిసమాజములో తొలిసారి మాధవరావును చూచాను. ఒకమూల బల్లదగ్గర వొంటరిగాకూర్చుండి మజ్జిగత్రాగుతూవున్నాడు. సరిగా ఒకగ్లాసుమజ్జిగ అరగంటసేపు త్రాగాడు. అతని పెదవులమధ్య 'సోడాస్ట్రా' వుందికాని అతనియోచనలు మాత్రము యెక్కడో !

మాధవరావు పొడగరి. పొడవుకు తగినంతకండ శరీరానికి లేదు. చెక్కిళ్లు గుంటలుపడి, చర్మముకళదప్పివున్నవి. తలయెన్నినాళ్లక్రిందనో దువ్వుకొన్నట్లుగావుంది. మజ్జిగత్రాగి లేచి ప్రక్కనేవున్న పడకకుర్చీలోవ్రాలాడు. కళ్లు మూసుకొన్నాడు. అనరాదుకాని ఆ పడకకుర్చీలో వున్నది జీవములేని శవములాగు కనబడింది. కోలముఖం, రేగిన తలవెంట్రుకలు, కొన్ని అంగుళాలు లోతుపోయిన కళ్లు—నిజంగా నాకు జాలివేసింది.

మాధవరావు కళ్లు తెరవకుండానే జేబునుంచి ఒకసిగరెట్ తీసి ముట్టించి పెదవులమధ్యనుంచి పొగవదలుతూవున్నాడు. ఒకప్రక్కనవ్వు—మరొకప్రక్క జాలి—యింకొకవైపు యీయన జీవితవిశేషములు యెలాగువుంటవో అన్న ఆశ్చర్యమూ నాకు. కొంతసేపు మాధవరావును చూచిచూచి చివరకు నాకే సిగ్గువేసింది—నేను యీతనిని యిలా చూస్తూవుంటే యెవరన్నా యేమన్నా అనుకోరా అనుకొని జేబులోని "లేబర్ హెరాల్డు" తీసి అమెరికాబాంకులలో కోట్లు ఖరీదుచేసే బంగారము మూలుగుతూఉంటే ప్రజలలో దారిద్ర్యము యెలావ్యాప్తి నందుతూవుందో తెలపే ఒకచక్కని వ్యాసము చదువుతూ అందులో నిమగ్నునైవుంటే యెవరో పిలచినట్లయింది. ఎవరా పిలచినది అనుకొంటూ చూచాను. ఆపడకకుర్చీలో వున్న ఆయనలేచి కూచున్నాడు. ఆతని లోతుకళ్లు మిలమిల లాడుతూవున్నవి. నేనతనిని చూడడానికి అవకాశము యీయకుండనే "ఏమండీ ఆపేపరు మీరు తెప్పిస్తున్నారా! మీరుచదివాక ఒక్కమారు యిస్తే యిక్కడే చూస్తాను" అన్నాడాయన.

నేను అలా ఆశ్చర్యపడుతూనే ఔనండినాకువస్తుంది యీపత్రిక చూడండి అంటూ ఆయనకు అందించాను.

'థాంక్సు' అంటూ ఆయన లేచివచ్చి ఆపత్రికను తీసికొని చూడ మొదలు బెట్టాడు.

ఇంక యెందుకు—యీయనయే మాధవరావు. మాధవరావు పత్రికను చూస్తూవున్నాడు. అతనిచూపు కాగితమును పొడిచివేస్తుందా అన్నంత తీక్ష్ణముగావుంది. పత్రిక చూస్తున్నకొలదీ అతని ముఖంలో క్రొత్తక్రొత్త కళలుకనబడుతూ ఉన్నవి. ఆశుష్కించిన చెక్కిళ్లకు ఒకవిధమైన—యేమనాలో తోచడములేదు—శోభవచ్చింది. హృదయము ఉప్పొంగుతూవున్నట్టుగావుంది. మళ్లీయింతలోనే ముఖం ధుమధుమలాడడము మొదలు బెట్టింది. నాకు యిదిఅంతా వింతగా కనబడింది.

నేను సోడాత్రాగుతూ ఆయన్ని చూచీచూడనట్లు చూస్తున్నాను.

ఆయన పత్రికచదవడము పూర్తిఅయింది. ముఖమంతా చెమటలుక్రమ్మిపోయింది. తెరమీది బొమ్మలకువలె కోలముఖములో యింతవరకు వెలుగుతూవుండిన రౌద్రభీభత్స విషాదఛాయలన్నీ అంతరించినవి. పత్రికను తిరిగి నాకు యిచ్చివేసి అలసిపోయినవానికి వలెపడకకుర్చీలో మళ్లీ ఒరగాడు.

ఐదునిముషాలు. "క్షమించండి, మీపేరు" అన్నాడాయన.

"శివానందం" అన్నాను.

"మీరు ఎక్కడవుంటున్నారు ? మీరింకొకలాగు భావించవద్దు, నేనువచ్చి మీవద్దనుండి ఆపత్రికలు పుచ్చుకొని చదువుకొందామని—"

నావిలాసం చెప్పాను. ఆతరువాత మీపేరు అని అడిగాను.

"మాధవరావు అంటారు"

మీరు ఎక్కడవుంటారు ! అని అడిగా. ఆయన చెప్పడానికి సంకోచించినట్లు కనబడింది. ఎందుకా యీయనను కష్టపెట్టడమని ఆవిషయమువదలి ఆయన గురించిన యోచన ప్రారంభమైంది. మాధవరావు పేరు నాకు చాలా పరిచితమైనట్లు అనిపిస్తూవుంది. ఎక్కడ చూచామా అని యోచించా. మాధవరావుపేరు చాలామారులు పత్రికలలో చూచాను. ఆయనకు కార్మికోద్యమముతో సంబంధమువుంది.

ఆనాటి సాయంకాలము యేవేవో రాజకీయముల గురించి మేమిద్దరము టూకీగా మాటలాడుకొన్నాము. ఇదేనేను మాధవరావును తొలిమారు చూడడము.

* * *

ఆనాడు కనబడిన మాధవరావు మళ్లీ చాలా కాలమువరకు నాకు కనబడలేదు. హఠాత్తుగామాత్రము మాధవరావుకోసము పోలీసులు హోటలలో వెతకడము అతడు కనబడకపోవడము వగయిరా వివరములు నా యెరుకను జరిగినవి.

మాధవరావు యేమయాడా అన్నఅనుమానము నాకు. అదేమోగాని కలసికొన్నది వాకేవొక మాగు—

మాటాడినది ముక్తసరిగ—అయినప్పటికిని నాకు అదొక విధమైన స్నేహము—అభిమానము యేర్పడింది.

* * *

నాకుగల స్నేహితులలో అనేకతరహాలు. అందులో ఒకడు కాటాకూలీ తాతయ్య. తాతయ్య ఒకకంపెనీలో పనిచేస్తూవుండేవాడు. అతడంటే నాకు మహాయిష్టం; అభిమానం. పనిలోవున్నప్పుడు "కూలీతాతయ్య"అని అందరనేవారు. నేను "మేస్త్రీ తాతయ్య" అనేవాణ్ణి. మేస్త్రీ అంటే తాతయ్యకు కోపంవచ్చేది మొదటిరోజుల్లో. కాని నేను అలాగే పిలిచేవాణ్ణి. నేనుపిలుస్తూ వుండడముచూచి అంతా మేస్త్రీ తాతయ్య అనేవారు. చివరకు తాతయ్య కోపంపోయింది. కాని తాతయ్య 'డిక్షనరీ'లో మేస్త్రీ అంటే 'కూలీ' అనియే అర్థం.

మేస్త్రీ తాతయ్య యిప్పుడు నిజంగాతాతయ్యయే అయాడు. కార్మికులవలసలో అతనిప్పుడు చిన్నగుడిసెలో కాపురం. ఇదివరలో మేస్త్రీ తాతయ్య మహాభక్తుడనిపేరు పడ్డాడు కాని నాతో స్నేహం యేర్పడినతరువాత ఆభక్తి కాస్తా పడగొట్టాను. తాతయ్య గట్టివే అనుకొంటూవున్న వన్నీ గాలిమేడలే, కేవలము కృత్రిమకల్పితములేఅని తలకు యెక్కించాను. దానితో మేస్త్రీతాతయ్యకు ఆభక్తి భావము—మార్గముపోయింది. కాని ప్రజలుయిదివరలో తాతయ్య పరమభక్తుడు అనుకొంటూవుండిన—ఆభావము అలానే వుండిపోయింది. ఇప్పుడు మేస్త్రీతాతయ్య యింటిలో పురాణగ్రంథాలు లేవు. తాతయ్య ప్రతిరోజూ పత్రికలు చదువుతూవుంటాడు. సమాజములోని హెచ్చు తగ్గులను సంస్కరించడము యెలాగో తెలియజేసే గ్రంథాలను చదువుతాడు. తనచుట్టూ మూగుతూఉండేవారికి ఆ అంశములను కథలరూపరంగా చిన్నచిన్న ఉపన్యాసముల రూపంగా చెపుతూవుంటాడు. మేస్త్రీ తాతయ్యకు సందేహాలు యేమన్నావుంటే నేను నెలకు రెండునెల్లకు అతని దగ్గరకు వెళ్లినప్పుడు అడుగుతూవుంటాడు. నేను చెపుతూ వుంటాను.

ఆపనులమీదా యీపనులమీదావుండడమువల్ల తాతయ్య మేస్త్రీ యింటికి వరుసగా నాలుగునెలలు వెళ్లలేదు. ఒకనాడు తాతయ్యమేస్త్రీ భార్య అంకమ్మ బజారుకువెళ్తూ మా యింటికివచ్చి యేలాగున్నానో— తాతయ్యమేస్త్రీ చూసిరమ్మన్నాడని చెప్పింది. సాయంత్రం తప్పకుండా వస్తానని చెప్పి అంకమ్మ అవ్వను పంపివేశాను.

సాయంత్రము క్లబ్బునుండి యింటికి వచ్చేముందు తాతయ్యమేస్త్రీ యింటికివెళ్లాను. తాతయ్యమేస్త్రీ ఆముదపుదీపం పెట్టుకొని తాడుతో తలకుకట్టుకున్న కళ్లజోడును కంటియెదట సరిగా ఒకచేతితో అమర్చుకొంటూ ఆనాటిపత్రిక చదువుతూవున్నాడు. తాతయ్య చదువుతూ వుంటే అవ్వ ప్రక్కన కూర్చుని దీపంఎగసన తోస్తూవుంది. ఆదృశ్యం చాలా యింపుగా కనబడింది; అలానే పదినిముషాల పాటు నిలబడి తాతయ్య ఒక టెలిగ్రామ్ వార్త చదివిన తరువాత నేను లోపలికివెళ్లా.

తాతయ్యమేస్త్రీ నన్నుచూచి "నేనేమో బయటికి పోలేను. చీకటిపడ్డాక మరీకష్టం, మీరు అప్పుడప్పుడు రాకపోతే యెంతోకష్టంగావుంది" అంటూ లేవబోయాడు. తాతయ్యను లేవనివ్వలేదు. నేనుప్రక్కనేవున్న ముక్కాలిపీటను ముందుకు లాగుకొని కూర్చున్నా.

తాతయ్య పాతచందువాపెట్టెను ముందుకు లాగాడు. అందులోనుండి యిన్నిపాతపత్రికల కత్తిరింపులు తీశాడు. వాటిని నాయెదటబెట్టి ఒకటితరువాత వొకటి అడిగి అన్ని సందేహాలు తీర్చుకున్నాడు. ఇది అంతా పూర్తిఅయేసరికి 9 గంటలు దాటింది.

అంకమ్మ ఆవుపాలు తెచ్చియిచ్చింది. ఆగ్లాసులోని పాలను పుత్రవాత్సల్యంతో అందించి త్రాగమన్నది. ఆపాలను మూడుగ్లాసులలోపోసి ముగ్గురము త్రాగాము.

నేను యింక బయలుదేరుతూ వుండగా యెవరో లోనికి వస్తారు. నేను మొదట తలయెత్తిచూడలేదు, కాని అది పరిచితకంఠమువలె తలలోప్రతిధ్వనించినట్లు ఒకమాట వినబడింది. "మనమిద్దరము యీవరలో కలసికొన్నాము." అంటూ ఆవ్యక్తి వచ్చి కూర్చున్నాడు. గురుతుపట్టాను. ఆవచ్చినది మాధవరావు. మేమిద్దరమును పరిచయులమే అని తెలిసికొన్న తాతయ్యమేస్త్రీ సంతోషపడ్డాడు.

మాధవరావు ముఖము చాలా ప్రశాంతముగా వుంది. ఆముఖానికి నిరుపేద కుటుంబములోని అమాయకపుబిడ్డ శుష్కవదనానికి యెటువంటి వ్యత్యాసముగాని కనబడలేదు.

ముక్తసరిగ మూడుమాటలు—నాకు వివరములు తెలిసినవి. మాధవరావు నగరములోని కార్మికులనందరిని ఒకేఒక మహాకుటుంబముగా చేసివేశాడు. ఆ ఊరిలోని కార్మికులలో యేయొక్కరికి అన్యాయము జరిగినను అది మొత్తము సంఘానికి జరిగినట్లుగా అంతా భావిస్తారు.

అందుకు ఆముందువారము జరిగిన ఊరేగింపే సాక్షి. క్రిందటి ఆదివారం ఉదయము ఊరిలోని, కార్మికులంతా మైదానములో సమావేశమయారు. అంతకు ముందు ముఖ్యమైన వీధులలో యిరువదివేలమంది బారులుతీరి అతిశాంతముగా ఊరేగింపుసాగించారు. తరిబియదుపొందిన సిపాయిలపటాలములుకూడా యిలా వుండవే అని ఆశ్చర్యపోయాను. ఆయిరువదివేలమందికిని ఒక్కొక్కని చేతిలో ఒక్కొక్క తుపాకీ ఉంచితే యింత మందినీ ఒక మహాపటాలముగా ఇండియా గవర్నమెంటు చేసివేయగలదుకదా అన్న భావము ఆసమయమున నాకు కలిగింది. ఆ బ్రహ్మాండమైన ఊరేగింపు చూచినవారికి ఒక విధమైన ఉద్రేకము భయము వేసింది.

మైదానములో అంతా కూర్చున్నారు. మైదానమునకు మధ్యనున్న ఒకగుట్టయే సభావేదిక. ఇద్దరుకార్మిక యువకులు లేచి కార్మికగీతాలు పాడారు. పిమ్మట సభకు అధ్యక్షత యెవరువహిస్తారో, యెవరు ఉపన్యసిస్తారో యెవరికీ తెలియదు. పత్రికావిలేఖరులు సి.ఐ. డీలు, పోలీసు వారు అంతా యెవరిమటుకు వారు ఆత్రముతోవున్నారు. వారిదృష్టిఅంతా వేదికపైపే వుంది. ఇంతలో ఆయిరువది వేలమందికూర్చున్నఆవరణలోఒకమూలనుండి ఒకకంఠము వినబడినది. పలుచటి—పొడుగాటి ఒకవ్యక్తి లేచి నిలువబడ్డాడు—అతడే మాటాడుతూవున్నాడు—అతడే మాధవరావు. ఆ నిశ్శబ్దాన్ని భేదిస్తూ, బాంబులవంటి మాటలు విసరేస్తూవున్నాడు. అంతా—చివరకు పోలీసులుకూడా చెవులు పొడిగించుకొని విన మొదలుబెట్టారు. ఐదునిముషాలు రాళ్లవర్షం కురిసినట్లు ఉపన్యసించాడు. ఉపన్యాసం పూర్తిఅయినదోలేదో పోలీసులు గుంపులో చొరబడ్డారు. సబ్ఇన్స్పెక్టర్ నాలుగు అడుగులు ముందుకువేసి మాధవరావ్, "You are under arrest" అన్నాడు. కూర్చున్న కార్మికులు వెంటనే నిలువబడ్డారు. పోలీసులు పరుగులెత్తారు. మైదానమంతా చుట్టివేస్తున్నారు పోలీసులు.

'మాధవరావు యేడీ' అని నా ప్రక్కనున్న పోలీసు అనుమానంతో అన్నాడు.

పోలీసులు ఎక్కడరహదారీ అక్కడ కట్టివేశారు. ఎవ్వర్నీ పోనివ్వలేదు. ఆ యిరువదివేలమందిని కలయ వెతకారు. దారికి అడ్డంవచ్చినవారికి పోలీసులాటీలు తగిలినవి. యినుపముళ్ల జోళ్లక్రింద యెందరికాళ్ళో నలిగి పోయినవి. తమాషా చూడడానికివచ్చిన పిల్లలకు యెందరికో దెబ్బలుతగిలినవి.

చివరకు మాధవరావు పోలీసులకు దొరకలేదు. నాటిపత్రికలలో కార్మికనాయకుడు మాయమయిన వివరములు ప్రకటింపబడ్డాయి.

ఆమైదానములో మాధవరావు మాటాడిన ఐదు నిముషములలో కార్మికులు ముందు యెలాగు సంచరించవలసినదీ తెలియజేశాడు. కార్మికులు అలాగుచేస్తారని ప్రభుత్వమునకు తెలుసు.

మరునాడు మిల్లు యజమానులు ప్రభుత్వోద్యోగులను వెంటబెట్టుకొని కూలీలపేటలకు వెళ్లారు. ముసలి కానీయండి ముదుకకానీయండి యెవరితో మాటలాడినా 'మేము యేమిచేయాలో మాధవరావుగారు చెప్పారు. అక్షరాలా వారుచెప్పినట్లుగానే చేస్తాముగాని కొంచము కూడా తప్పం. మమ్మల్ని యెవ్వర్నీ పనిలోనుండి తీసివెయ్యకూడదు. ప్రస్తుతముయిచ్చే కూలియే చాలా తక్కువగా వుందంటే యిందులో కొన్ని వందలమంది పనులనుండి తీసివేయడమా ? యజమానులు యిలా చెయ్యరాదని

మేము వేసుకొంటున్నాము. మా ప్రార్థనవినడానికి అంగీకరించకపోతే మేము మాధవరావుగారి సలహా అనుసరిస్తాము." అనేవారేగాని ఎవ్వరూ స్వంతంత్రించి మాటాడలేదు. మాధవరావువచ్చి ఆయిరువదివేలమంది కార్మికులను ఒకే ఒకమారు కాలువలోకి దుముకమంటే దుమికివేస్తారు — అది నిజం.

మిల్లు యజమానులు పదిహేనువందల మందిని పనులనుండి తీసివేయ నిశ్చయించారు. 1500 మందికి ఒకనెల నోటీసులు యిచ్చారు.

నోటీసులు అందిననాడే కర్మాగారములన్నింటిలోను పనిచేస్తూయున్న కార్మికులంతా కర్మాగారముల నుండి బయటకు వచ్చివేశారు. కార్మికులంతా జండాలు పట్టుకొని మైదానమువైపు శాంతముగా ఊరేగింపుసాగించారు. తాతయ్యామేస్త్రి అగ్రాసనాధిపత్యం వహించాడు. సభ శాంతంగా జరిగిపోయింది. ఆసభలో రెండేరెండు తీర్మానాలు: ఒకటి, 15 వందలమంది కార్మికులను పనుల నుండి తొలగించడము ధనికులు సమాజముపట్ల చేసిన అక్రమము. రెండు, మాధవరావుమీద కార్మికులకు సంపూర్ణమైన విశ్వాసము. ప్రభుత్వము అతనినినిర్బంధించ ప్రయత్నించడముపట్ల కార్మికులకు అసమ్మతి.— యీతీర్మానములు ఏకగ్రీవముగా ఆమోదింపబడినవి.

తాతయ్యా మేస్త్రి సభను ముగిస్తూ "మనమంతా యిప్పుడు గవర్నమెంటు లేబర్ డైరెక్టరుగారివద్దకువెళ్దాము, మనకష్టనష్టములను వారితో చెప్పుకొందాము. మీరంతా శాంతంగా—యెటువంటి అల్లరిలేకుండ నా వెంటరండి" అన్నాడు.

ఊరేగింపు సాగుతూవుంది. మైదానముదాటి, వీధిమలుపుదాటి కార్మికులు మిల్లుల ప్రక్కనుండి వెళ్తూవున్నారు. ఇంతలో యెక్కడనుండియో రెండురాళ్లువచ్చి పడినవి. ఒకరిద్దరికి గాయములు. కార్మికులు కొందరు వీరావేశము యెత్తారు. మేస్త్రితాతయ్యా గాయపడిన వారికి అక్కడనే కట్లుకట్టించాడు. శాంతిబోధచేశాడు. గాయపడినవారిని ముందు తనతో తీసికొనివెళ్తూవున్నాడు.

హటాత్తుగా కొందరు రౌడీలుదారిని అటకాయించారు. బడితెలతో ముందున్న కార్మికులను బాదారు. "ప్రాణాలమీద తీపివుంటే పనులకు వెళ్లండి—లేకపోతే—" అంటూ కర్రలు యెత్తారు. మొదటిదెబ్బ తాతయ్యామీద పడింది. ఇంకనేను ఆదొమ్మిలో ఉండలేక పోయాను.

మరునాడు ఉదయము పత్రికలలో నాటి ఊరేగింపు ముచ్చటలులన్నీ వెలువడినవి. నామిత్రుడు మేస్త్రి తాతయ్యా హాస్పిటలులో చనిపోయాడు. అతనితో మరి ముగ్గురుప్రాణాలువదలారు. యిరువదిమందికి తీవ్రగాయముల తగిలినవి.

వెంటనే నేను హాస్పిటలుకు వెళ్లాను. తాతయ్యాను కడపటి మారుచూచాను. ప్రాప్తించినది హటాత్మరణమే అయినప్పటికిని తాతయ్యాముఖం ప్రశాంతంగావుంది. అయ్యో, పాపం! అనుకొని బయటకు వచ్చాను.

కార్మికులపేటలో అంతా కల్లోలము. ఇక్కడ ఒకత్రోపులాట—అక్కడ వొక ఖూనీ—మరొకసందులో ఒక వాగ్యుద్ధము—యిలాగునే ఆయావరణ అంతా అల్లకల్లోలమయివుంది. ఎంత పోలీసు బందోబస్తు వుండినా చిన్నచిన్న పోట్లాటలు జరుగుతున్నవి.

పత్రికలలో అనేక వింతవింత వార్తలు. ఇది హిందూమహమ్మదీయ కలహమని కొన్నిపత్రికలు వ్రాశాయి. కార్మికుల కలహాలు అని కొన్నిపత్రికల ప్రకటించనవి. కొన్నికొన్ని రిపోర్టులు వింతగావున్నవి. ఒకమిల్లు యజమాని నాడుమూడుగంటలనుండి 4 గంటల వరకు నాతో మాటాడుతూ ఉన్నాడు. ఆతనిగురించి ఒక పత్రిక "శ్రీ............వారు మధ్యాహ్నము రెండు గంటలనుండి సాయంత్రము ఐదుగంటలవరకు కార్మికుల గృహములకు స్వయముగవెళ్లి వారికి అన్నహారములు, పసిబిడ్డలకు పాలు పంచిపెట్టుచున్నారు. వీరి యౌదార్యమునకు కార్మికులు తృప్తిపొందుచున్నారు." అని ప్రకటించినది. దీనిని చదువుకొని నేను నవ్వుకొన్నాను.

కార్మికులది ఒకేఒకపట్టు: "మాధవరావుగారు గంగ దుముకమన్నను దుముకుతాము" కాని మాధవరావు యేడి ?

ఉన్నకొలదియు కార్మికుల ఆవరణలో కొట్లాటలు యెక్కువ అవుచున్నవి.

పోలీసు కమీషనర్ కార్యాలయములో అర్ధరాత్రి సమయమువరకును సమాలోచనలు జరుగుచునేయున్నవి. ఒక్కొక్కరును ఒక్కొక్కసలహా యిస్తున్నారు. ఏవీ నచ్చడములేదు-శాంతినాశించే కమీషనరుకు .

అర్ధరాత్రి ఒంటిగంట సమయము. ఒకవీధిలోని కార్మికులయిండ్లకు యెవరోనిప్పు అంటించారు. ఆమంటలు చూచి నేను బయటకువెళ్లడానికి సిద్ధమౌతూవుంటే వడివడిగ మాధవరావు నాదగ్గరకు వచ్చాడు "గోలజరుగుతూ వుంది. కార్మికులు యింక సహించలేరు. నేను యేదన్నా చేయాలి. ప్రభుత్వం నేనుచెప్పినట్లుచెయ్యాలి. మీరు కమీషనరుతో మాటాడాలి" అన్నాడు.

నేను యోచిస్తున్నాను.

"యోచనకు సమయంకాదు. వెళ్లండి వెంటనే కమీషనర్‌వద్దకు; సంగతి చెప్పండి" అన్నాడు.

ఆ కళ్లలోని భావాలు నాకు అర్థముకాలేదు. నాకదేమో-కారణము చెప్పలేనుకాని నాకాసమయమున అతని చూపులమీద అసహ్యము అనుమానము కలిగింది.

వెంటనే మాధవరావును మోటారులో యెక్కించుకొని కమీషనరు కార్యాలయానికి వెళ్లాను. మాధవరావు చెప్పినట్లుగా దొడ్డిదారివద్దనున్న చింతచెట్టు క్రింద మోటారును ఆపి, ఒంటరిగా కమీషనరు ఆఫీసులోనికి వెళ్లాను. కర్తవ్యాంశమును గురించి ముక్తసరిగా మూడు మాటలలో చెప్పివేశాను.

కమీషనరు లేచాడు. యిటూ అటూ తిరిగాడు. 'ఎలాగునన్నా ఈ దొమ్మి ఆగిపోవాలి. అది నాకు కావాలి" అన్నాడు.

అందుకు అతడేసాధనం. మీరు మాట యివ్వండి అతన్ని అరెస్టుచేయనని. నేను యీక్షణాన మీయెదుట పెడతాను" అన్నా

"సరే" అన్నాడు.

కమీషనర్ ఆడినమాట తప్పనివాడు. వెంటనే వెళ్లి మాధవరావును తీసికొనివచ్చి కమీషనరుయెదుట పెట్టాను. ఇద్దరూ లోనికి వెళ్లిపోయారు.

నేను హాలులో ఆత్రుతతో కూర్చున్నాను. మధ్యమధ్య కమీషనరు ప్రైవేట్ సెక్రటరీ, లోనికి వెళ్తూన్నాడు వస్తున్నాడు.

గూండాల ఎరెస్టు అన్నారు. అంతకు ముందు అది జరుగుతూనేవుంది. కొంచము చురుకుగా మాత్రము ఎరెస్టులు జరిగాయి.

తెల్లగ తెల్లవారిపోయింది. నేను అక్కడనే కూర్చుండి పోయాను. కార్మికుల ఊరేగింపు సాగుతూ వుంది. వారి ఉత్సాహము, వారి పాటలు నాకు వినబడుతోనేవున్నవి. వాళ్లంతా మిల్లులయెదుట సత్యాగ్రహము చేయడానికి వెళ్తున్నారని నేను యెరుగుదును.

నాయోచనలలో నేనుండగా ప్రైవేటు సెక్రటరీ వచ్చి నన్ను రమ్మన్నాడు. కమీషనరు మాధవరావు యిద్దరూ ఒకరితో నొకరు సంభాషిస్తున్నారు. నేను దగ్గరకు వెళ్లి కూర్చున్నాను.

"అన్నింటికీ సమాధానపడ్డాము. కాని బయటకు వచ్చి కార్మికులను యిండ్లకు మరలమని చెప్పమంటే అది వీలులేదంటున్నారు మాధవరావుగారు. ఒకప్రక్క మిల్లు యజమానులు మాధవరావుగారు చెప్పినట్లుగా వినేభారం నాదని వొప్పుకొన్నా. ఇంక పనులకు వాళ్లని వెళ్లమని మాధవరావుగారు చెప్పాలి; వారు అందుకు అంగీకరించడము లేదు." మనమే ఆపని చేయాలంటున్నారు" అన్నాడు కమీషనరు.

సరే, అలాగునే చేదాం" అన్నాను నేను.

కమీషనరు యోచనచేసి సరే అని కార్మికులు సత్యాగ్రహము చాలించి సమ్మె సమాప్తి చేయడానికి సిద్ధముకావాలన్నది మాధవరావుగారి హుకుమ్ అని పోలీసులచే "టంకు" వేయించడానికి యేర్పాటు జరిగింది.

* * *

పదిగంటలైంది. ఆ దండోరా యేమీ పనిచేయ లేదని తెలిసింది. మరియొక మార్గముకోసము యోచన. నాకు అప్పుడు మాధవరావుమీద అనుమానముకలిగింది. ఏదో అతని హృదయములో రహస్యోద్దేశము వుంది—యిది నాభావన. నేనున్న కారణమున అతడు సందేహిస్తు న్నాడని తోచింది. సరే, యింక యిక్కడ ఉండడము ప్రతిబంధకమని నేను చల్లగా వెళ్లిపోయాను.

* * *

నాటి సాయంత్రము యింటినుండి బయటకు వచ్చాను. యెక్కడ చూచినా మాధవరావు సంతకము లతో అచ్చైన పెద్దపెద్ద ప్రకటనలు కనబడ్డాయి. "కార్మికు లంతా తమ కార్యక్రమాన్ని నిలుపుచేయాలి. మిల్లు యజమానులు చెప్పినట్లు చేయాలి. క్రమముగా అన్ని సౌకర్యములగురించిన ప్రయత్నములును జరుగుతవి—యివి ఆప్రకటనలోని అంశాలు.

* * *

కార్మికులంతా పాపం ఎప్పటివలె పనులకు వెళ్లారు. పనులనుండి బర్తరఫ్అయిన 500 మందీ అలానే అవస్థపడుతూ వున్నారు.

నాకు యిదియంతా అర్థముకాలేదు. మాధవ రావు... ...?

సరే, నాల్గుమూడురోజులలో యదార్థము బయట పడింది. కార్మికులకు తనమీదగల విశ్వాసమును ఒక ఆధారముగా తీసికొని మిల్లు యజమానుల మీదను ధని కులమీదను అధికారము చెలాయించడమే మాధవరావు యొక్క ఆంతరంగికాభిప్రాయమని తేలినది. ఈవిధముగా మాధవరావు ఆనగరములో ఒక చిన్న సర్వాధికారి—డిక్టేటరు అయాడు.


## 1000 రోగాలు
## ఒకే సంజీవి ప్రయోగము

ప్రాచ్య ప్రతీచి వైద్యులచేత అన్ని ఖండాలలోను వాడ బడుచున్నది ఈ సంజీవి. అన్నివిధముల నొప్పులను పాగ్రదోలు టలో సంజీవి యనదగిన యీ నీలగిరి యూక్లిప్టస్ ఆయిల్ ప్రతి ఇంటను ఉండవలెను. ఒక సీసా తైలముండిన అన్నివేళలను ఒక వైద్యుడు మనఇంట నున్నట్లు భావింపవచ్చును.

ఒక అవున్సు బుడ్డి
వెల 4 అణాలు.




డజను సీసాలు
2—8—0.

నీలగిరి యూక్లిప్టస్ ఆయిల్

---

## దగ్గుమందు.

ఈ మందు సేవించుట వలన శ్వాసదగ్గు ఈడుపుదగ్గు, క్షయ, గొంతునస వగయిరా దగ్గు లన్నియు నశించును. గొంతును క్రమ్మివేసి ఉక్కి బిక్కిరిచేయు కఫమును హరించును. వేలకొలది మంది వాడియుండిన ప్రసిద్ధౌషధము. నాల్గుదినములు వాడి ననే గుణము తెలియగలదు.

ధర సీసా 1-కి రు 1—0—0

కరుణానిధి డిపో,
నెం. 6, వెంకటేశమేస్త్రి వీధి, మదరాసు.